# సీక్రెట్ లైఫ్ ఆఫ్ వాల్టర్ మిట్టీ

~ జేమ్స్ థర్బర్ (అనువాదం: వెంకట్ సిద్ధారెడ్డి)



**సినిమా వెనుక కథ:** సీక్రెట్ లైఫ్ ఆఫ్ వాల్టర్ మిట్టీ

**రచన:** జేమ్స్ థర్బర్

**అనువాదం:** వెంకట్ సిద్ధారెడ్డి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=821

©Author.
**What can you do with this document?**
Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use
**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

*“సినిమా వెనుక కథలు” శీర్షికన వస్తున్న రెండో కథ ఇది. చిన్న కథ లోని ముఖ్యమైన ఆలోచనను తీసుకుని, దానిని విస్తరించి పూర్తి స్థాయి చలనచిత్రంగా రూపొందించడంలో విజయవంతమైన వాటిలో ఒకటి. “సీక్రెట్ లైఫ్ ఆఫ్ వాల్టర్ మిట్టీ” చాలా చిన్న కథ. కానీ విస్తరించడానికి ఎంతో అవకాశం ఉన్న కథ. కాబట్టే ఐదు పేజీలైనా లేని ఈ కథ 1947 లోనే ఒక పూర్తి స్థాయి చలనచిత్రంగా తెరకెక్కింది; వారం క్రితమే (డిశెంబర్, 25, 2013) మరోసారి అమెరికాలో ఈ కథ ఆధారంగా రూపొంచించబడ్డ మరో చలనచిత్రం విడుదలైంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథ రచయిత జేమ్స్ థర్బర్, తన కథ ఆధారంగా సినిమా తీయకుండా ఉండడానికి ఒక నిర్మాతకు పదివేల డాలర్లు ఎదురివ్వడానికి సిద్ధపడ్డాడట. చాలా గమ్మత్తుగా సాగే ఈ కథలో ముఖ్య పాత్రధారి వాల్టర్ మిట్టీ. కథ పరంగా చూస్తే ఇందులోనుంచి కేవలం సెటప్ మాత్రమే తీసుకోగలిగే అవకాశం ఉంది. 1947 లో వచ్చిన సినిమాలో మిట్టీ పాత్ర వయసు తగ్గించి, అతని భార్య స్థానంలో తల్లి పాత్రని ప్రవేశ పెట్టారు. ఆ పైన మరి కొన్ని కొత్త పాత్రలను పరిచయం చేయడమే కాకుండా, కలల్లో మాత్రమే కాకుండా చివరికి నిజజీవితంలో కూడా హీరో గా నిలిచిపోయే పాత్రలా మిట్టీ పాత్ర ను రూపొందించారు. ఈ కథ ప్రేరణతోనే మన తెలుగు రచయిత త్రిపుర “సుబ్బారాయుడి రహస్య జీవితం” కథను రాశారు. – వెంకట్ సిద్ధారెడ్డి*

## ది సీక్రెట్ లైఫ్ ఆఫ్ వాల్టర్ మిట్టీ

“మనం బయల్దేరుతున్నాం!” కమాండర్ గొంతు కంచులా మోగింది. అతను యూనిఫామ్ ధరించి ఉన్నాడు; భారీ అల్లికలు కలిగిన తెల్లని టోపీని ఒక వైపుగా కిందకి లాగి స్టైలిష్ గా తలపై పెట్టుకున్నాడు. “నన్నడిగితే ఈ తుఫాన్లో మనం ముందుకు వెళ్లడం ఏ మాత్రం మంచిది కాదు సార్”. “నేను నిన్ను అడగడం లేదు లెఫ్టెనెంట్ బెర్గ్. మనం బయల్దేరుతున్నాం! హెడ్ లైట్స్ స్విచాన్ చేయండి! ఇంజన్ సామర్థ్యాన్ని 8500కు పెంచండి!” అన్నాడు కమాండర్. ఇంజన్ విభాగంలోని సిలిండర్లు సంఘటితమై భారీ శబ్దం చేస్తున్నాయి: టా–టకటా–టకటా–టకటా–టాటకటా. పైలట్ సీటు దగ్గరున్న కిటికీ అద్దంపై ఏర్పడిన మంచు వైపు తేరిపార చూసాడు కమాండర్. దగ్గరకు నడిచి

అక్కడున్న క్లిష్టమైన అమరికలో ఉన్న మీటలను అటూయిటూ మార్చాడు. "ఎనిమిదవ నెంబర్ సహాయక ఇంజన్ ని కూడా ఆన్ చేయండి" అంటూ అరిచాడు. ఆ మాట అందుకుని, "ఎనిమిదవ నెంబర్ సహాయక ఇంజెన్ ని ఆన్ చేయండి" అంటూ తన వాళ్లవైపు చూసి అరిచాడు లెఫ్టినెంట్ బెర్గ్. "మూడో నెంబర్ ఫిరంగిలో మందుగుండు పూర్తిగా నింపండి!" అరిచాడు కమాండర్. "మూడో నెంబర్ ఫిరంగిలో మందుగుండు పూర్తిగా నింపండి!" హైడ్రోప్లేన్ లోని ఎనిమిది ఇంజన్లు గట్టి శబ్దం చేస్తూ మొదలయ్యాయి. ప్లేన్ లోని వివిధ భాగాలను సిద్ధం చేస్తూన్న సిబ్బంది ఒకరి వైపొకరు చూసుకుని నవ్వుకున్నారు, "ఈ ముసలాడు ఎలాగోలా మనల్ని ఇక్కడ్నుంచి బయటపడేస్తాడు. అసాధ్యుడు. అసలు భయమన్నది ఏ కోశానా లేదు!" ఒకరితో ఒకరు అనుకున్నారు.

"చాలా స్పీడ్ గా వెళ్తున్నారు" అరిచింది మిట్టీ భార్య . "ఎందుకంత స్పీడు? అవతలేం మునిగిపోయిందని" అడిగింది.

"ఏంటీ?" అన్నాడు వాల్టర్ మిట్టీ. తన పక్క సీట్లో కూర్చుని ఉన్న తన భార్య వైపు ఆశ్చర్యంగా చూశాడు; నిర్ఘాంతపోయాడు. ఓ క్షణం అతనికేమీ అర్థం కాలేదు. గుంపులోనుంచి తోసుకొచ్చి అకారణంగా తన మీద అరిచి గోలచేసే వింత మహిళలా అనిపించిందామె. "యాభై ఐదులో వెళ్తున్నారు మీరు," అందామె. "నలభై కిలోమీటర్ల స్పీడు కి మించి వెళ్లడం నాకిష్టముండదని మీకు తెలుసు కదా. యాభై ఐదులో ఉన్నారు మీరు." వాల్టర్ మిట్టీ ఏమీ మాట్లాడలేదు. ఇరవై ఏళ్ల తన విమానయానపు అనుభవంలోకెల్లా అతి ఘోరమైన తుఫానులో దూసుకెళ్తున్న SN202 హైడ్రోప్లేన్ చప్పుళ్లు తన మదిలోనుంచి మెల్లగా జారుకుంటుండగా, నగరంలోని షాపింగ్ మాల్ వైపు మౌనంగా తన కారుని పోనిచ్చాడు. "మీకు మళ్లీ ఏదో అయ్యింది. ఎందుకలా బిగుసుకుపోతున్నారు?" అంది అతని భార్య. "చెప్తే వినరు. డాక్టర్ రెన్షా కి చూపించుకోండి ఒకసారి. ఎందుకైనా మంచిది."

వాల్టర్ మిట్టీ కారు ని షాపింగ్ మాల్ ముందు ఆపాడు. "నేను హెయిర్ కటింగ్ చేసుకుని వచ్చే లోగా మీరెళ్లి మంచి బూట్లు కొనుక్కోండి," అందామె కారులోనుంచి దిగడానికి సిద్ధమవుతూ. "నాకేమీ అవసరం లేదు," అన్నాడు మిట్టీ. "మీతో వాదించే సమయం నాకు లేదు. అయినా మీరింకా వయసులో ఉన్నారనుకుంటున్నారేమో," అంటూ అద్దంలో ఒకసారి తనని చూసుకుని

కారు లోనుంచి దిగిందామె. ఆమె దిగగానే మిట్టీ కారు ని ముందుకు తియ్యడానికి సిద్ధమయ్యాడు. "మీ గ్లౌవ్స్ ఏమైపోయాయి? ఈ చలిలో మీరు గౌవ్స్ ఎందుకు వేసుకోవటం లేదు?" మిట్టీ మౌనంగా తన ప్యాంట్ జేబులోనుంచి గ్లౌవ్స్ తీసుకుని చేతులకు వేసుకున్నాడు. ఆమె అలా షాపింగ్ మాల్ లోకి వెళ్లగానే కారుని ముందుకు పోనిచ్చాడు. కారు ఒక రెడ్ సిగ్నల్ దగ్గర ఆగగానే గ్లౌవ్స్ తీసి వేసే ప్రయత్నం చేస్తుండగా ట్రాఫిక్ సిగ్నల్ రంగు మారింది. పక్కనే ఉన్న పోలీసు వాడు "బ్రదర్, కారు తీయండి," అని హడావుడి చేయడంతో గ్లౌవ్స్ వెనక్కి లాక్కుని అక్కడ్నుంచి బయల్దేరాడు. ఏ లక్ష్యం లేకుండా కాసేపు నగర వీధుల్లో చక్కర్లు కొట్టాడు మిట్టీ. కాసేపటికి హాస్పిటల్ పక్కన ఉన్న పార్కింగ్ స్థలం వైపు కి కారుని పోనిచ్చాడు.

"...వెలింగ్టన్ మెక్మిలాన్ అనీ ఒక కోటీశ్వరుడు," అంది నర్స్. "అవునా?" అన్నాడు మిట్టీ, తన చేతికి ఉన్న గ్లౌవ్స్ తీస్తూ. "ప్రస్తుతం కేస్ ఎవరు హ్యాండిల్ చేస్తున్నారు?" అని అడిగాడు. "డాక్టర్ రెన్షా మరియు డాక్టర్ బెన్‌బో. వాళ్లతోపాటు ఇద్దరు స్పెషలిస్ట్ లు కూడా ఉన్నారు; డాక్టర్ రెమింగ్టన్ న్యూయార్క్ నుంచి వచ్చారు. డాక్టర్ పిచర్డ్ మిట్‌ఫోర్డ్ లండన్ నుంచి ఈ కేసు కోసం ప్రత్యేకంగా వచ్చారు." నర్స్ తో పాటు మిట్టీ కారిడార్ లో నడుస్తుండగా ఒక గది తలుపు తెరుచుకుని డాక్టర్ రెన్షా బయటకు వచ్చాడు. అతని మొహంలో తీవ్రమైన అలసట, ఆందోళన కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. "హలో మిట్టీ. నీకు మెక్మిలాన్ తెలుసు కదా! అదే కోటీశ్వరుడు; రూజ్‌వెల్ట్ కి మంచి స్నేహితుడు కూడా! అతని కేసు మా చావుకొచ్చింది... క్లోమ వాయువులు కాలేయంలోకి పాకడంతో పరిస్థితి విషమించింది. మీరొక సారి చూడగలిగితే..." అన్నాడతను. "తప్పకుండా," అన్నాడు మిట్టీ.

ఆపరేషన్ థియేటర్ లో గుసగుసల మధ్య మిట్టీని పరిచయం చేశాడు అందరికీ : "డాక్టర్ రెమింగ్టన్, డాక్టర్ మిట్టీ. డాక్టర్ పిచర్డ్ మిట్‌ఫోర్డ్ , డాక్టర్ మిట్టీ." "ఎక్వైర్డ్ డయాబిటీస్ సింద్రోమ్ గురించి మీ పరిశోధనలను చదివాను, నిజంగా అద్భుతం సర్," మిట్టీ తో సంతోషంగా చేతులు జోడిస్తూ అన్నాడు పిచర్డ్. "ధన్యవాదాలు," అన్నాడు మిట్టీ. "మీరు అమెరికాలో ఉన్నారన్న విషయమే తెలియదు మిట్టీ," కొంచెం కోపంగా అన్నాడు రెమింగ్టన్. "ఈ కేసు కోసం నన్ను న్యూయార్క్ నుంచీ, పిచర్డ్ ని లండన్ నుంచి ప్రత్యేకంగా పిలిపించారు" "ఈ కేస్ గురించి మీరు ప్రత్యేకంగా వచ్చినందుకు ధన్యవాదాలు," అన్నాడు మిట్టీ. ఇంతలో ఆపరేషన్ టేబుల్ కి

అనుసంధానంగా ఉన్న ఒక పెద్ద మెషీన్ "టా–టకటా–టకటా–టకటా–టాటకటా" అంటూ శబ్దం చేయనారంభించింది. "ఈ కొత్త అనస్థిటైజర్ మెషీన్ ఎక్కడో దెబ్బతిన్నట్టుంది," కంగారుగా అరిచాడు ఒక జూనియర్ డాక్టర్. అందరూ అతని వైపు చూశారు. "దీన్ని బాగు చేయగలిగే వాళ్ళు ఈ రాష్ట్రంలో ఎవరూ లేరు," అన్నాడతను. "సరే, అరవొద్దు. ఏదో ఒకటి చేద్దాం లే!" అంటూ మిట్టీ ఎంతో ప్రశాంతంగా మెషీన్ దగ్గరకు వెళ్ళాడు. అది ఇప్పుడు "టా–టకటా–టీటిక్–టా–టీటీటిక్" అంటూ వింతగా శబ్దాలు చేస్తోంది. మెషీన్ పై మెరుస్తున్న కొన్ని మీటలను కదిలించి చూశాడు. "మీలో ఎవరి దగ్గరైనా ఫౌంటెన్ పెన్ ఉందా?" అన్నాడు మిట్టీ. ఎవరో అతనికి ఒక ఫౌంటెన్ పెన్ అందించారు. మెషీన్ పై భాగాన్ని తెరిచి చూశాడు; లోపల దాదాపు విరిగిపోయే పరిస్థితిలో ఉన్న ఒక సీల తీసి దాని స్థానంలో ఫౌంటెన్ పెన్ ని అమర్చాడు. "ఒక పది నిమిషాల వరకు ఈ మెషీన్ పనిచేస్తుంది. ఆపరేషన్ కొనసాగించండి," అన్నాడు. ఇంతలో ఒక నర్స్ వేగంగా రెన్షా వద్దకు వెళ్ళి చెవిలో ఏదో చెప్పింది. మిట్టీ చూస్తుండగానే రెన్షా మొహం తెల్లబోయింది. "పేషంట్ కోరియాప్సిస్ స్థితిలోకి జారుకున్నాడు," ఇబ్బందిగా అన్నాడు డాక్టర్ రెన్షా. "మిట్టీ, ఇక మీరే ఏదైనా చెయ్యాలి" భయంతో వణుకు మొదలైన అతని వైపు ఒకసారి చూశాడు మిట్టీ. మరో వైపు ఏం చెయ్యాలో తెలియక చేతులు నలుపుకుంటూ నిల్చున్నారు ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు. "సరే నా ప్రయత్నం చేస్తాను," అన్నాడు మిట్టీ. అతనికి ఒక తెల్లటి డాక్టర్ గౌన్ తొడిగారు; మిట్టీ తన మాస్క్ ని ఒకసారి సరి చూసుకున్నాడు; గ్లోవ్స్ ని పైకి లాక్కున్నాడు. ఇంతలో నర్స్ మెరుస్తోన్న ఒక పరికరాన్ని అతని చేతిలో...

"గురువుగారూ కాస్త చూసుకుని వెళ్ళండి. ఏదో ఒకదాన్ని గుద్దెయ్యగలరు!" వాల్టర్ మిట్టీ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేశాడు. "ఇక్కడ పార్క్ చెయ్యకూడదండీ," అన్నాడు పార్కింగ్ అటెండెంట్. "ఓ సారీ," అన్నాడు మిట్టీ. తను కారాపిన ప్రదేశం కార్లు బయటకు వెళ్ళే దారిలో అడ్డంగా ఉందని గ్రహించాడు మిట్టీ. కారు వెనక్కి తీస్తుండగా "ఫర్వాలేదు సార్. అక్కడ వదిలేయండి. నేను పార్క్ చేస్తాను" అన్నాడు పార్కింగ్ అటెండెంట్. మిట్టీ కారులోంచి దిగుతుండగా "తాళాలివ్వండిసార్" అని అటెండెంట్ అనడంతో, మిట్టీ తన కారు తాళం చెవులని అతనికి ఇచ్చాడు. వెంటనే అటెండెంట్ కారులోకి దూసుకెళ్ళి ముందుకీ, వెనక్కి ఎంతో చాకచక్యంగా నడుపుతూ ఖాళీ ప్రదేశంలో కారుని పార్క్ చేశాడు.

ఈ పనివాళ్లు పెద్ద అతిగాళ్ళు; వీళ్లకే అన్నీ తెలుసనుకుంటారు, అని అనుకుంటూ వీధిలో నడక ప్రారంభించాడు మిట్టీ. మంచులో ప్రయాణించేందుకు వీలుగా తన కారు టైర్లకు బిగించిన గొలుసులు విప్పడంలో తను ఇబ్బంది పడిన ఘటన అతనికి గుర్తుకొచ్చింది. ఆ రోజు కారు టైర్లకు ఉన్న గొలుసు తొలిగించే క్రమంలో, టైర్ల మధ్య గొలుసు ఇరుక్కుపోయింది . ఆ తర్వాత కాసేపటికి ఒకడు వచ్చి తన వైపు చూసి అదోలా నవ్వుతూ, గొలుసు విప్పాడు. అప్పట్నుంచీ కారు టైర్ కి వేసిన గొలుసు విప్పడానికి ఎవరో ఒకరి సాయం తీసుకోమని బలవంతపెడ్తుంది మిట్టీ భార్య. ఈ సారి నుంచీ ఇలాంటి పరిస్థితుల్లో, తన కుడి చేతికి ఒక కట్టు కట్టుకోవాలనుకున్నాడు మిట్టీ; అప్పుడు ఎవరూ తనని చూసి నవ్వరనుకున్నాడు. ఈ ఐడియా ఏదో బావుంది. కుడిచేతికున్న కట్టు చూసిన వాళ్ళు, నేనా గొలుసు తీసే పరిస్థితిలో లేనని అనుకుంటారు. ఇలా ఆలోచిస్తూ నడుస్తోన్న మిట్టీ ఫుట్ పాత్ మీద ఉన్న మట్టి కుప్పను కాలితో తన్నాడు. “బూట్లు,” అని తనలో తనే అనుకుని, దగ్గరలో ఏదైనా చెప్పుల అంగడి కనిపిస్తుందేమోనని చుట్టూ చూశాడు.

అప్పుడే కొన్న బూట్ల డబ్బాను చంకలో పెట్టుకుని వీధిలోకి వచ్చిన వాల్టర్ మిట్టీ, తన భార్య కొనమని చెప్పిన మరొక వస్తువేంటో గుర్తురాక సతమతమయ్యాడు. ఇంటినుంచి బయల్దేరే ముందు ఆమె రెండు సార్లు మరీ మరీ చెప్పింది. అయినా వారం వారం ఇలా టౌన్ లోకి షాపింగ్ కి రావడం, ప్రతి సారీ ఏదో ఒక తప్పు జరగడం– ఇదంతా చాలా ఇబ్బందికరంగా తోచింది మిట్టీకి. మొహం తుడుచుకునే తువ్వాలా? షేవింగ్ చేసుకునే బ్లేడా? కాదు కాదు. టూత్ పేస్ట్, బ్రష్, సోడా ఉప్పు, బొంద మరియు బోషాణం? అతని వల్ల కాలేదు. కానీ ఆమెకు మాత్రం ఖచ్చితంగా గుర్తుంటుంది. “నేను తెమ్మన్న అది ఏది? మర్చిపోయానని మాత్రం చెప్పొద్దు,” అంటుందామె. ఇంతకీ–ఏంటా–అది. వార్తాపత్రికలమ్ముతున్న ఓ కుర్రాడు, ఏదో సెన్సేషనల్ కేసు గురించి వచ్చిన హాట్ హాట్ న్యూస్ అరుస్తూ మిట్టీ ని దాటుకుంటూ వెళ్లాడు.

...“బహుశా ఇది చూస్తే మీకు జ్ఞాపకం వస్తుందేమో!” డిఫెన్సు న్యాయవాది హఠాత్తుగా బోను లో ఉన్న వ్యక్తి వైపు దూసుకొచ్చి ఒక తుపాకీ ని అతనికి అందచేశాడు. “ఇది మీరెప్పుడైనా చూశారా?” వాల్టర్ మిట్టీ తుపాకీ ని తన చేతిలోకి తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించాడు. “ఇది నాదే. వెబ్లే వైకర్స్. 50.80 మోడల్,” నెమ్మదిగా చెప్పాడు మిట్టీ. కోర్టు హాల్లో కలకలం రేగింది. “ఆర్డర్. ఆర్డర్” అంటూ ఆదేశించాడు న్యాయమూర్తి. “పట్టపగలే ఆయుధాలు పట్టుకుని తిరిగేంత

కిరాతుకుడివి నువ్వు, నిజమేనా?" పరోక్షంగా ఆరోపిస్తూన్న ధోరణిలో అడిగాడు న్యాయవాది. "అబ్జెక్షన్ యువరానర్!" అరిచాడు మిట్టీ తరపు న్యాయవాది. "నా క్లయింట్ తుపాకీ వాడగలిగే పరిస్థితుల్లో లేడని ఇదివరకే మేము నిరూపించాము. జులై పధ్నాలుగవ తేదీ రాత్రి నా క్లయింట్ చేతికి కట్టు కట్టబడి ఉన్నదన్న సాక్ష్యాధారాలు మీకు అందచేశాం." వాల్టర్ మిట్టీ ఏదో చెప్పదలుచుకున్నట్టుగా తన చేతిని పైకెత్తడంతో వాదించుకుంటున్న న్యాయవాదులిద్దరూ ఆగిపోయారు. "ఈ తుపాకే కాదు. ప్రపంచంలోని ఏ తుపాకీతో ఐనా, మూడొందల అడుగుల దూరం నుంచి సైతం, నా ఎడం చేత్తో గ్రెగరీ ని కాల్చి చంపి ఉండేవాణ్ణి." మరోసారి కోర్ట్ హాలు మొత్తం గందరగోళంలో పడిపోయింది. ఇంతలో ఒక యువతి గట్టిగా ఏడుస్తూ వాల్టర్ మిట్టీ నిల్చున్న బోను దగ్గరకు వచ్చి అతని ఒడిలో వాలిపోయింది. న్యాయవాది ఆమెను అక్కడ్నుంచి లాగే ప్రయత్నం చేశాడు. న్యాయవాది గడ్డం పై ఒక పిడిగుద్దు విసిరుతూ "పోరా పిచ్చి కుక్కా!" అంటూ అరిచాడు మిట్టీ.

"కుక్క బిస్కెట్లు!" సంతోషంగా అరిచాడు వాల్టర్ మిట్టీ. రోడ్ మీద నడుస్తున్నవాడల్లా ఒక్కసారిగా ఆగిపోయాడతను. అప్పటివరకూ తనను చుట్టుముట్టిన కోర్ట్ భవంతి మెల్లగా మాయమై నగరంలోని భవనాలు ఒక్కసారిగా లేచి నిలబడ్డాయి. మిట్టీని చూస్తూ నవ్వుకుంటూ వెళ్ళిపోయిందో యువతి. "అతను కుక్క బిస్కెట్లంటున్నాడు." అని తన పక్కనున్నామెతో అంది. "తనలో తానే కుక్క బిస్కెట్లని అనుకుంటున్నాడు. వినలేదా?" వాల్టర్ మిట్టీ అక్కడ్నుంచి చప్పున ముందుకు కదిలాడు. ముందు కనిపించిన పెద్ద సూపర్ మార్కెట్ వదిలేసి రోడ్డు చివర్లో ఉన్న మరో చిన్న సూపర్ మార్కెట్ లోకి అడుగుపెట్టాడు. "చిన్న కుక్క పిల్ల కోసం బిస్కెట్లు కావాలి," అని అక్కడ పనిచేసే గుమాస్తాని అడిగాడు. "ఏదైనా స్పెషల్ బ్రాండ్ కావాలా సార్?" తుపాకీ పేల్చటంలో జగమెరిగిన మొనగాడు కాసేపు ఆలోచించాడు. "ఆ పాకెట్ మీద 'ఒకసారి తింటే మళ్ళీ మళ్ళీ కావాలంటాయి' అని రాసి ఉంటుందే అది," చెప్పాడు మిట్టీ.

వాచీలో టైం చూసుకున్నాడు. ఇంకో పదిహేను నిమిషాల్లో తన భార్య కటింగ్ చేపించుకోవడం పూర్తవుతుంది. ఒకవేళ తలారడం ఆలస్యమైతే ఇంకొంచెం సమయం పట్టొచ్చు; ఒక్కోసారి ఆమె తలారడానికి చాలా సమయం పడ్తుంది. ముందు ఆమే హోటల్ కి చేరుకోవడం ఆమెకిష్టం ఉండదు. మిట్టీనే ముందు హోటల్ కి చేరుకుని అక్కడ తన కోసం ఎప్పటిలానే

ఎదురుచూడాలనుకుంటుంది. హోటల్ లాబీ లో ఉన్న పెద్ద కుర్చీలో కూలబడ్డాడు మిట్టీ. బూట్లు పెట్టెను, కుక్క బిస్కెట్లున్న సంచీతో పాటు నేలమీద పెట్టాడు; పక్కనే ఉన్న పాత పత్రికనొకదాన్ని తీసి కుర్చీలో చేరగిలబడ్డాడు. "తన వైమానిక దళంతో జర్మనీ ప్రపంచాన్ని జయించగలదా?" అనే వ్యాసంలో ఉన్న విమానాలు, బాంబు దాడిలో నేలమట్టమయిన భవనాల చిత్రాలను చూశాడు వాల్టర్ మిట్టీ.

... "సార్, ఫిరంగుల మోతకి మన ర్యాలే బాగా జడుసుకున్నట్టున్నాడు," చెప్పాడు సార్జెంట్. చెరిగిపోయిన జుట్టు తన మొహం మీద పడుతుండగా, తలెత్తి పైకి చూశాడు కెప్టెన్ మిట్టీ, "అతన్ని మిగతావాళ్లతో కలిపి పడుకోబెట్టండి. నేను ఒక్కణ్ణే వెళ్తాను." "కానీ మీరు వెళ్లడం అసాధ్యం సర్! ఆ బాంబర్ విమానం నడపడానికి ఇద్దరు పైలట్లు ఖచ్చితంగా అవసరం. అంతేకాదు. ఆ జర్మన్ విమానాలు ఇప్పటికే మన విమానాలను తుత్తునియలు చేసేస్తున్నాయి. వోన్ రిచ్మన్ తన జర్మన్ విమానాలతో ఇక్కడ్నుంచి ఫ్రాన్స్ వరకూ గాల్లో విన్యాసాలు చేస్తున్నాడు," ఆందోళనగా అన్నాడు సార్జెంట్. "ఎవరో ఒకరు ముందుకు వెళ్లకపోతే వాళ్ల ఆటలు సాగుతూనే ఉంటాయి సార్జెంట్! నేను వెళ్తున్నాను. రా, ఓ పెగ్గేసుకుందాం," రెండు గ్లాసుల్లో బ్రాందీ పోసి ఒకదాన్ని సార్జెంట్ కి అందించాడు. యుద్ధ బీభత్సపు గర్జింపులు అతి సమీపంలో వినిపిస్తున్నాయి. బయట పేలిన ఒక బాంబు ధాటికి వారు కూర్చున్న గది తలుపులు సైతం ఛిన్నాభిన్నమయ్యాయి. "ఇదేదో బాగా దగ్గరగా పడింది," లెక్కలేనట్టుగా అన్నాడు కెప్టెన్ మిట్టీ. "జర్మన్ సైన్యం చుట్టుముడుతోంది కెప్టెన్," అన్నాడు సార్జెంట్. "చచ్చినా బతికినా ఒకటే సారి కదా సార్జెంట్," అలవోకగా నవ్వుతూ అన్నాడు మిట్టీ. "కానీ చచ్చికూడా బతకగలం తెలుసా?" అంటూ మరొక పెగ్ బ్రాందీ పోసుకుని తాగేశాడు. "క్షమించండి సార్... కానీ మీ అంత స్టైల్ గా బ్రాందీ తాగేవాళ్లని మరెక్కడా చూడలేదు సార్," అన్నాడు సార్జెంట్. మిట్టీ సమాధానం చెప్పలేదు. అక్కడ్నుంచి లేచి తన వెబ్లే వైకర్స్ తుపాకీ ని సర్దుకున్నాడు. "ఎదర ఓ నలభై కిలోమీటర్ల దాకా నరకమే సార్," అన్నాడు సార్జెంట్. మిట్టీ చివరి పెగ్ కానిచ్చేశాడు. "ఆలోచిస్తే జీవితమే నరకం సార్జెంట్!" మరఫిరంగుల దాడి పెచ్చరిల్లుతోంది. టట్-టట్ మంటూ మెషీన్ గన్ ల చప్పుళ్లు మారుమోగిపోతున్నాయి. దూరంగా ఎక్కణ్ణుంచో యుద్ధ ట్యాంకులు "టా-టకటా-టకటా-టకటా-టాటకటా" అని వికృతంగా శబ్దాలు చేస్తూ ముందుకు కదులుతున్నాయి. "ప్రియతమా

నీవచట కుశలమా" అని పాడుకుంటూ తలుపు దగ్గరకు నడిచాడు వాల్టర్ మిట్టీ. ఇంతలో వెనక్కి తిరిగి సార్జెంట్ వైపు చూస్తూ, "మళ్లీ కలుద్దాం!" అని చెప్తుండగా...

అతని భుజాన్నేదో తాకింది. "హోటలంతా మీ కోసం వెతుకుతున్నాను! ఈ పాత కుర్చీలో మునగదీసుకు పోతే మీరెక్కడున్నారో నాకెలా తెలుస్తుంది?" అంది మిట్టీ భార్య. "టార్గెట్ దగ్గరకొచ్చేస్తుంది," అన్నాడు పరధ్యానంగా. "ఏంటీ! ఇంతకీ నేను తెమ్మన్న అది తెచ్చారా? కుక్క బిస్కెట్లా? ఆ బాక్స్ ఏంటి?" అందామె. "బూట్లు," అన్నాడు మిట్టీ. "షాప్ లోనే వేసుకుని రావొచ్చుగా," అంది. "ఆలోచించాను. నేను కూడా అప్పుడప్పుడూ ఆలోచించగలనని నీకెప్పుడూ తట్టదా?" అన్నాడు మిట్టీ. ఆమె మిట్టీ వైపు చిత్రంగా చూసింది. "ఇంటికి వెళ్లగానే కాస్త మీ టెంపరేచరు చూడాలి," అందామె.

కిర్రు కిర్రు మని శబ్దం చేస్తున్న రివాల్వింగ్ డోర్స్ నుండి వారు బయటకు నడిచారు. కారు పార్కింగ్ చేసిన స్థలం అక్కడకు రెండొందల మీటర్ల దూరంలో ఉంది. ఇద్దరూ పార్కింగ్ వైపు నడుస్తుండగా, దారిలో కనిపించిన మందుల షాపు ఎదురుగా ఆగి, "మీరు ఇక్కడే ఉండండి. నేను ఏదో కొనడం మర్చిపోయాను. ఒక్క నిమిషంలో వచ్చేస్తాను." అందామె. ఆమె నిమిషంలో తిరిగిరాదని అతనికి తెలుసు. సిగెరెట్ ముట్టించాడు వాల్టర్ మిట్టీ. ఇంతలో వర్షం మొదలైంది; మంచు కలిసిన వర్షం. అతను సిగెరెట్ తాగుతూ మందుల షాపు గోడకానుకున్న వాడల్లా... ఉన్నట్టుండి నిటారుగా నిల్చున్నాడు. "లొంగే ప్రసక్తే లేదు" అంటూ, ఆఖరు దమ్ము లాగి సిగెరెట్ ని నేలకేసి కొట్టాడు. అతని మొహం మీద ఒక చిరునవ్వు ప్రత్యక్షమైంది. ఎదురుగా ముంచుకొస్తున్న పటాలాన్ని ఏ మాత్రం లెక్క చెయ్యకుండా వారి కేసి తిరస్కారపూరితంగా చూస్తూ తన చొక్కా గుండీలు విప్పి గర్వంగా రొమ్ము చూపించి కాల్చమని సవాలు చేస్తూ శిల్పంలా నిల్చున్నాడు — చివరివరకూ అజేయంగా పోరాడిన వాల్టర్ మిట్టీ.

★

For Latest Telugu Books - Visit now:

Kinige.com